క్లుప్తంగా

అన్నదాన భవనానికి రూ.50 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడలో రాజంపేటకు చెందిన దొడ్డపనేని రాజనాయుడు రూ.50 వేల విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ శిఖర ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా ఈ శిఖర ప్రతిష్ఠను నిర్వహించారు. ఈ పూజలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కొత్తపేట: జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 9న స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల కక్షిదారులు రాజీ చేసుకునేందుకు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వికసిత భారత్ అందరి లక్ష్యం కావాలి

ఆలమూరు: వికసిత భారత్ అందరి లక్ష్యం కావాలని ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు, గుమ్మిలేరు గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ యాత్రకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. వికసిత భారత్‌కు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, గుణ్ణం రాంబాబు, కార్యదర్శులు ఎస్.సంజీవరెడ్డి, కె.మోక్షాంజలి పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. కార్తికమాసం పవిత్రతను పురస్కరించుకుని స్థానిక గౌతమీ గోదావరి తీరంలో గ్రామానికి చెందిన రైతులు అడ్డాల సుబ్బరాజు, ఎరుబండి రమణ, వీరా రాజు, నాగిరెడ్డి సాయి, బండారు సత్తిబాబు పర్యవేక్షణలో అయ్యప్ప స్వాములకు ఈ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలివెల ధర్మసత్రం భూమి కౌలుకు వేలం ఖరారు

కొత్తపేట: మండలంలోని పలివెల ధర్మసత్రానికి చెందిన 1.69 ఎకరాల భూమి కౌలుకు ఉపయోగించుకునేందుకు వేలం నిర్వహించినట్లు ధర్మసత్రం ఈఓ నడింపల్లి ప్రసాదరాజు తెలిపారు. పలివెల గ్రామం పరిధిలోని ఆ భూమిని 11 సంవత్సరాల పాటు కమర్షియల్‌గా వినియోగించుకునేందుకు బుధవారం ఎండోమెంట్స్ అండ్ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భారతి సమక్షంలో వేలం పెట్టగా బహిరంగ వేలంలో పి.గన్నవరం మండలం పప్పులవారిపాలెం గ్రామానికి చెందిన వాసుకూరి వెంకటసాయి రామ్ హెచ్చు పాటగా నెలకు రూ.23 వేలు శిస్తు చెల్లించేలా పాడుకున్నట్టు ఈఓ ప్రసాదరాజు తెలిపారు. 3 సంవత్సరాల అనంతరం నుంచీ ప్రతి మూడేళ్లకు పాడుకున్న మొత్తంపై 30 శాతం పెంచి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాచుపాము పట్టివేత

సఖినేటిపల్లి: అంతర్వేదికరలోని రావి త్రినాథులు ఇంట్లో మంగళవారం రాత్రి చొరబడిన ఓ తాచు పామును బుధవారం ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మ బంధించారు. వంటింట్లో రాత్రి బుసలు కొడుతున్న శబ్దం విన్న ఇంటి యజమాని గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సదరు ఇంటికి చేరుకున్న వర్మ, గోధుమతాచును గుర్తించి, చాకచక్యంతో డబ్బాలో బంధించారు. దీంతో ఇంట్లో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. పామును బంధించిన వర్మకు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంబాజీపేట: అపరిష్కృతంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని అంబాజీపేట మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ పని భారం తగ్గించాలని, రెగ్యులర్ చేయాలని, వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్.దుర్గామల్లేశ్వరి, బి.పాపాయమ్మ, లలిత పాల్గొన్నారు.



గెద్దాడలో వరి పనలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతు



పల్లిపాలెం తుపాను షెల్టర్‌లో బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు ఇస్తున్న తహసీల్దార్ రామకుమారి



అంబాజీపేట మండలం పీర్మాయిపాలెంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



రాజోలులో సోంపల్లి డ్రైన్ పూడిక తీత పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆదిమూలంవారి పాలెంలో నీటిమునిగిన వరి పనలను చూపుతున్న రైతులు

నిండా ముంచిన తుపాను

- ముంపు నీటిలో పనలు
- తడిసి ముద్దయిన పంట
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

మామిడికుదురు/అయినవిల్లి/మలికిపురం/సఖినేటిపల్లి/అంబాజీపేట/పి.గన్నవరం/రాజోలు/రావులపాలెం/ఆత్రేయపురం: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు రైతులను నిలువునా ముంచాయి. భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. నగరం, మొగలికుదురు, మామిడికుదురు, గెద్దాడ గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. ఈ గ్రామాల్లో వందల ఎకరాల్లో పంట భారీ వర్షానికి ముంపుబారిన పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. అయినవిల్లి మండలం మాగాంలో తుపాను కారణంగా తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధైర్యపడవద్దని రైతులకు హామీ ఇచ్చారు. తడిసిన ప్రతిగింజను కొనుగోలు చేస్తామన్నారు. మాగాం, అయినవిల్లి, నేదునూరు, నల్లచెరువు గ్రామాల్లోని ముంపునకు గురైన పంట పొలాల్లో నీటిని మళ్లించేందుకు మురుగు కాలువల వెంబడి పొక్లెయిన్ సాయంతో చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. మలికిపురం మండలంలో తుపాను బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి చేలను ఆయన పరిశీలించారు. రామరాజులంక గ్రామంలో నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను సాయం అందిస్తుందని అన్నారు. సఖినేటిపల్లి మండలంలోని తీరప్రాంత గ్రామం పల్లిపాలెంలో బుధవారం తుపాను ముంపు బాధితులకు అధికారులు ఫుడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. స్థానిక తుపాను షెల్టర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తహసీల్దార్ వై.రామకుమారి బాధితులకు వీటిని పంపిణీ చేశారు. అంబాజీపేట మండలంలో కురిసిన భారీ వర్షానికి 1900 ఎకరాల్లో వరి పంట నేలకు వరిగి, నీటి మునిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇసుకపూడి, చిరతపూడి, కె.పెదపూడి, మాచవరంలో ఉన్న డ్రైనేజీలు, పంట బోదెల ద్వారా వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు జేసీబీతో శుభ్రం చేయించారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు, భారీ వర్షానికి కొబ్బరి చెట్లు విద్యుత్ వైర్లపై పడటంతో 12 విద్యుత్ స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. పి.గన్నవరం మండలంలోని చేలన్నీ జలమయమయ్యాయి. వరి పనలు, ధాన్యం రాశులు నీటిలో మునిగిపోయాయి. కోతకు వచ్చిన వరిచేలు నేలకొరిగిపోయాయి. నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం గ్రామాల్లో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పర్యటించారు. బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వర్షం తగ్గిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 2500 ఎకరాల్లో వరిపంట వర్షాలకు నీట మునిగిందని ఏఓ కళ్యాణ్ కుమార్ తెలిపారు.

రాజోలు మండలంలో సుమారు మూడువేల హెక్టార్లలో వరిపంట నీటమునిగింది. ముంపునీరు తొలగించేందుకు తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం చర్యలు చేపట్టింది. రాజోలు తహసీల్దారు, సబ్ ట్రెజరీ కార్యాలయాల గదిలోకి వర్షపునీరు చేరింది. ఆ నీటిని తొలగించేందుకు సిబ్బంది బక్కెట్లతో తోడుకున్నారు. శివకోడు వరిచేలు ముంపునకు కారణమవుతున్న నాగమల్లి డ్రైన్‌ను రైతులతో కలసి తహసీల్దారు ముక్తేశ్వరరావు తదితర అధికారులు పరిశీలించారు. అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పరిశీలించారు. రావులపాలెం మండలంలోని లక్ష్మీపోలవరంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటించారు. అధిక వర్షాల వలన మునిగిపోయిన వరి పొలాలను, ఇతర పంటలను పరిశీలించారు. పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినవిల్లి మండలంలోని 1154 హెక్టార్లలో వరిపంట ముంపునకు గురైందని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు.

ఆత్రేయపురం మండలంలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని పార్టీ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలించారు.



చిరతపూడిలో నీట మునిగిన వరిచేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



ముంగండలో సహాయక చర్యలు చేపడుతున్న తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్



నీటమునిగిన గంగలకుర్రు సిద్ధార్థనగర్ కాలనీ

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది



అవిడిలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి రైతులకు ధైర్యం చెప్పారు. మిచాంగ్ తుపాను భారీ వర్షాల కారణంగా మండలంలోని అవిడి గ్రామంలో పడిపోయి నేలనంటిన వరి పంటతో పాటు సుడిగాలి వలన ధ్వంసమైన కొబ్బరిచెట్లు, పశువుల పాకలు, గడ్డిమేట్లు, తడిసిపోయిన ధాన్యం రాశులు, బస్తాలను జగ్గిరెడ్డి బుధవారం ఆర్డీఓ ఎం.ముక్కంటితో కలసి పరిశీలించారు. ఈ తుపాను వల్ల జరిగిన పంట నష్టాన్ని గురించి స్థానిక అధికారులతో సమీక్షించారు. నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని మీకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని రైతులకు ధైర్యం చెప్పారు. చేలల్లో ఉన్న ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు చేర్చుకునే విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే ముంపునకు గురైన పూజారిపాలెం గ్రామస్తులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామంలో తుపాను బాధిత కుటుంబాల వారందరినీ మోకాలు లోతు నీటిలో వెళ్లి పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 400 మంది తుపాను బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నిబంధనలు సడలించి ఒక మోస్తరు బాధిత కుటుంబాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆదుకోవాలని, ఆ మేరకు రాత్రికి 800 భోజనం ప్యాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతంలో గత కొంతకాలంగా స్థానికులను పట్టి పీడిస్తున్న మురుగు సమస్య ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చొరవతో పరిష్కారమైంది. పూర్వం నుంచీ ఉన్న కమ్మిరెడ్డిపాలెం ప్రాంతం నుంచి కౌశిక డ్రైన్‌కు అనుసంధానంగా ఉన్న మురుగు డ్రైన్ విషయం వివాదం ఏర్పడగా నీరు వెళ్లే మార్గం లేక మురుగు సమస్య ఏర్పడింది. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో వారు మురుగునీరు మళ్లించేలా జేసీబీతో బోదెను బాగుచేయించారు. జగ్గిరెడ్డి వెంట అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ దూళి సూరిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, పలివెల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పొనుగుపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఆలమూరు: ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం ఇంటింటికీ వైద్య సేవలను అందిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని సంధిపూడి గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరుగుతున్న టీకాల ప్రక్రియను ఆయన పరిశీలించారు. చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను ఏఎన్ఎం కె.విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన టీకాల ప్రక్రియను చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, కె.జ్యోతికుమార్ హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, జొన్నాడ-2, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో తదితర వ్యాధుల నివారణకు వ్యాక్సిన్లు అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని సంధిపూడిలో బుధవారం రూ.10 లక్షలతో చేపట్టనున్న ఎస్సీ పేట రామాలయం పునర్నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. సుమారు 15 అడుగుల లోతులో ఏర్పాటు చేసిన ప్రదేశంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న అనేక దేవాయాలను అభివృద్ధి చేసేందుకు టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి మంజూరు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, ఏజీపీ నామాల శ్రీనివాసు, తోరాటి గోవిందు, పోలాబత్తుల చిన్న, బొర్రా సత్యనారాయణ, గొడితి వెంకన్న పాల్గొన్నారు.



సంధిపూడిలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

భారీ వర్షాలకు కుంగిన వంతెన

పి.గన్నవరం: మండలంలోని ముంజవరపుకొట్టు గ్రామంలో సాంఖ్యాయన డ్రెయిన్‌పై ఉన్న వంతెన మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుంగిపోయింది. అప్రోచ్ గోడ డ్రెయిన్‌లో పడిపోయింది. దీంతో కార్లు, భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్‌కు సూచించారు. ఠాగూర్ అక్కడ చేరుకుని ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి, తక్షణమే వంతెనకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, నియోజకవర్గ పార్టీ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు దేశిరాజు సీతారామయ్య తదితరులు వంతెన పరిశీలించారు. అలాగే ముంపునకు గురైన వరిచేలను కూడా వారు పరిశీలించి, రైతులతో మాట్లాడారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం

- వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన నేతలు

మలికిపురం: అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ తోడ్పడాలని, ఆ మహనీయుని అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సమన్వయ సమాఖ్య అధ్యక్షుడు గడ్డం తులసీ భాస్కరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గెడ్డం ఫిలిప్‌రాజు, ఎస్సీ వెల్ఫేర్ నాయకులు చింతా రాజబాబు, నల్లి శివకుమార్, కొల్లాబత్తుల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దశా, దిశ నిర్దేశకుడు అంబేడ్కర్

కొత్తపేట: భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా దేశానికి దశా, దిశ నిర్దేశించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కమ్మిరెడ్డిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ చావలి సుబ్బారాయశాస్త్రి, ఎంపీపీ కార్యాలయం ఏఓ మేడపాటి హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్ఎస్ టీసీ కన్వెన్షన్ హాలు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలుచోట్ల పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయం ఎంతో గొప్పదని, ఆ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్‌లు వాసంశెట్టి రేవతి, జల్లి బాలరాజులు అన్నారు. అంబాజీపేట బస్‌స్టేషన్ వద్ద, మాచవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పెదబాబు ఆధ్వర్యంలో, మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి చేశారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో అంబేడ్కర్ వర్ధంతిని జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జరిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాకర శ్రీను తదితరులు హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. తొలుత వీరు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు జనిపల్లి భీమారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మండల దళిత నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ, వార నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన ఆధ్వర్యాన ముక్తేశ్వరం సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ సర్పంచ్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు.

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని, అతను దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ప్రస్తుతించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండ్ సెంటర్లోని విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు. పలు పార్టీల నేతలు, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలమూరు: ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని సంధిపూడి, చింతలూరు గ్రామాల్లో బుధవారం జరిగిన అంబేడ్కర్ 67వ వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశ సమగ్రతకు, సౌభ్రాతృత్వానికి, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఆలమూరులో సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో పాలకవర్గ, గ్రామ సచివాలయ సిబ్బంది వర్ధంతిని జరుపుకున్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోను డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం రావులపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకటరావు ఎంపీటీసీలు కోట విజయకుమారి, గెద్దం ఆశ, ఎంపీడీఓ జి.రాజేంద్ర ప్రసాద్, మండల విద్యా శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే రావులపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి గ్రామ ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, వార్డు సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పి.గన్నవరంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, డీటీ బి.గోపాలకృష్ణ, పార్టీ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, దొమ్మేటి దుర్గారావు, కొక్కిరి రవికుమార్, పాటోలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: అంబేడ్కర్ మహనీయుని ఆశయాలు అనుసరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం మండలంలోని 17 గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ర్యాలి గ్రామంలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పీఎస్ఆర్ జయపాల్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మలికిపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ముక్తేశ్వరం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు

రైతులకు అండగా ఉపాధి కూలీలు

మామిడికుదురు: భారీ వర్షాలతో ముంపుబారిన పడిన పంటను రక్షించే పనుల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు రైతులకు బాసటగా నిలిచారు. మామిడికుదురు, నగరం, పెదపట్నం, మాకనపాలెం, పాశర్లపూడి, గెద్దాడ గ్రామాల్లో కూలీలు రెండు రోజుల నుంచి పంట పొలాల్లో నిలిచిపోయిన ముంపు నీటిని బయటకు మళ్లించే పనులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మంది కూలీలు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ముంపు నీటిని పంట పొలాల నుంచి బయటకు మళ్లించేందుకు బాటలు ఏర్పాటు చేస్తూ రైతులకు తోడుగా నిలుస్తున్నారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఏపీఓ ఆర్.రమేష్‌బాబు నేతృత్వంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు.

వరిచేలను పరిశీలించిన ఏరువాక బృందం

అయినవిల్లి: తుపాను, ఈదురుగాలుల కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వరిచేలు ముంపునకు గురై నేలనంటాయి. ఈ చేలను బుధవారం ఏరువాక శాస్త్రవేత్త గౌరికుమారి బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని నేదునూరు, నల్లచెరువు గ్రామాల్లో వీరు పర్యటించారు. మండలంలోని 90 శాతం రైతులు ఎంటీయూ 1318 వరి రకం వేసినట్లు గుర్తించారు. ఈ రకం వరి వర్షాలకు పడిపోవడం, మొలకెత్తడం జరగదన్నారు. ధాన్యం గింజలు మొలకెత్తకుండా ఉండడానికి ఒక లీటరు నీటిలో 50 గ్రాములు ఉప్పు కలిపి చేను మీద పనుల మీద పిచికారీ చేయాలని సూచించారు. దీని వల్ల ధాన్యం రంగు మారే ప్రమాదం ఉండదన్నారు. ఆమె వెంట వ్యవసాయ అధికారులు మనోహర్, వై. శోభ, పలువురు రైతులు ఉన్నారు.